జాడలేని వర్షం.. సాగు ప్రశ్నార్థకం

- ఇప్పటివరకు జల్లులే..
- దుక్కులు దున్ని, వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- భారీ వర్షాలు కురిస్తేనే నాట్లు వేసేది..
- కొన్నిచోట్ల తుంపర సేద్యం
- గన్నేరువరం మండలంలో పరిస్థితి



పారువెల్లలో తుంపర సేద్యంతో మొలకెత్తిన పత్తి





ఖాసీంపేటలో నారుమడి, నీరులేక వెలవెలబోతున్న వరద కాల్వ

గన్నేరువరం: వానాకాలం ప్రారంభమై మూడు వారాలు గడిచిపోయింది. గన్నేరువరం మండలంలో ఇప్పటివరకు జల్లులే తప్ప భారీ వర్షపాతం నమోదైంది లేదు. మే నెలలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని, విత్తనాలు విత్తేందుకు ఎరువులను చల్లుకున్నారు. వాతావరణ శాఖ సైతం జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురుస్తాయని చెప్పడంతో ఈ ఏడాది సాగు ముందుగానే ప్రారంభమవుతోందని పంటల సాగుకు సిద్ధమయ్యారు. కానీ, జూన్ పూర్తవుతున్నా సరైన వర్షాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

16 గ్రామాలు..

గన్నేరువరం మండలంలోని 16 గ్రామాల్లో 18,900 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇందులో 13,500 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తారన్న అంచనాతో అధికారులు ముందుకు సాగుతుంటారు. ఈసారి వానాకాలంలో విత్తనాలను విత్తేందుకు రైతులు సిద్ధమవగా వర్షాలు జాడ లేకుండా పోయాయి. సాగు ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తుంపర సేద్యం అందుబాటులో ఉన్నవారు ఈనెల రెండో వారంలో పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తగా కొందరి చేలల్లో మొలకెత్తాయి. మరికొందరి చేలల్లో మొలకెత్తే దశలో ఉన్నాయి. తుంపర సేద్యం పరికరాలు లేని రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆరుద్ర కార్తెలోనైనా వానలు పడతాయనుకున్న అన్నదాతలకు నిరాశే మిగులుతోంది.

10 వేల ఎకరాలకు పెరిగిన వరి సాగు

గన్నేరువరం మండలం మెట్ట ప్రాంతం కావడంతో తీవ్రమైన కరువు ఉండేది. 2019 ముందు వరకు ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న పంటలే ఎక్కువగా సాగు చేసేవారు. వరి మాత్రం 2,500 ఎకరాల వరకు సాగయ్యేది. ఆ తర్వాత మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తవడం.. కాళేశ్వరం జలాలు అందుబాటులోకి రావడంతోపాటు అధిక వర్షపాతం వల్ల జలకళ సంతరించుకుంది. దీంతో మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా మండలంలోని పొలాలకు సాగు నీరందించేందుకు ఉపకాల్వలు–8, 9, 12, 14లను అప్పటికే పూర్తి చేశారు. ఉపకాల్వలకు నీటిని విడుదల చేసి, చెరువులు, కుంటలు నింపారు. ఈ పద్ధతి గతేడాది వరకు కొనసాగింది. దీంతో మండలంలో భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా 2019 నుంచి 2023 వరకు వర్షాలతో సంబంధం లేకుండా రైతులు ఏకంగా 10 వేల ఎకరాల్లో వరి సాగు చేసుకున్నారు. ఆరుతడి పంటలు పండించడం చాలావరకు తగ్గిపోయింది.

భారీగా తగ్గిన నీటి నిల్వలు..

కానీ, ఈ ఏడాది ఇప్పటివరకు భారీ వర్షాలు లేకపోవడంతో మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా తగ్గాయి. సాగునీరు విడుదల చేయకపోవడం, భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. సాగు నీరు లేక ఉపకాల్వలు వెలవెలబోతున్నాయి. ఇప్పటివరకు 4 వేల ఎకరాలకు సంబంధించి రైతులు వరి నారు పోసుకున్నారు. భారీ వర్షాలు కురిస్తేనే నాట్లు వేసే పరిస్థితి ఉంటుంది. అలాగే, సుమారు 2,200 ఎకరాల పత్తికి గానూ 850 ఎకరాల్లో, 700 ఎకరాల మొక్కజొన్నకు గానూ 400 ఎకరాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు విత్తనాలు విత్తుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆశించిన స్థాయిలో వానలు కురిస్తేనే పప్పుదినుసులు, కూరగాయల పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందని చెబుతున్నారు.

సాగు ఆలస్యమైతంది



ఈ ఏడాది సరైన వర్షాలు లేక పంటల సాగు ఆలస్యమైతంది. సాగునీరు లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. బావిలో ఉన్న కొద్దిపాటి నీటితో నారు పోసిన. భారీ వర్షాలు కురిసి, సాగునీరు అందుబాటులోకి వస్తేనే పంటలు పండుతాయి. ఈసారి రెండెకరాల్లో వరి సాగు చేయాలనుకుంటున్న.

– బుర్ర అంజయ్యగౌడ్, రైతు, గన్నేరువరం

తుంపర సేద్యం ఎంచుకున్న



వర్షాలు లేకపోవడంతో నేను తుంపర సేద్యం ఎంచుకున్న. రెండెకరాల్లో మొక్కజొన్న, రెండున్నర ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాను. నాలుగెకరాల్లో వరి సాగు చేయాలని, నారు పోశాను. కూలీల ఇబ్బంది లేకుండా మెషిన్‌తో నాటు వేయించాలనుకుంటున్న. పంటల సాగు మరింత ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం పడుతుంది.

– బద్దం రాజేశ్వర్‌రెడ్డి, రైతు, ఖాసీంపేట

క్లుప్తంగా

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, మల్లేశం, శ్రీనివాస్, మనోహర్, పోచయ్య, రాజిరెడ్డి, రాజేంద్రాచారి, కనకయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే



సర్వే చేస్తున్న జీపీ కార్యదర్శి మహేందర్‌రావు, ఏఈవో చందర్

తిమ్మాపూర్: మండలంలో ల్యాండ్ యుటిలైజేషన్ ఫీల్డ్ వెరిఫికేషన్ సర్వే కొనసాగుతోంది. పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు, ఏఈవో పున్నం చందర్ రెండు రోజులుగా సర్వే చేస్తున్నారు. వివరాలను ప్రభుత్వానికి పంపనున్నట్లు గురువారం తెలిపారు. ప్రభుత్వ అవసరాల కోసం ఖాళీ స్థలాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో అర్హులైన దివ్యాంగులు సదరం క్యాంపు కోసం ఈ నెల 29న మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై నెలకు సంబంధించి ఆర్థో సమస్యలున్నవారికి 3న, మానసిక వికలాంగులైతే 9న, కంటిచూపు సమస్యలున్నవారికి 15న, వినికిడి లోపం ఉన్నవారికి 23న క్యాంపులుంటాయని తెలిపారు. అలాగే, ఆగస్టు నెలకు సంబంధించి ఆర్థో సమస్యలున్నవారికి 6న, మానసిక వికలాంగులైతే 11న, కంటిచూపు లోపం ఉన్నవారికి 20న, వినికిడి లోపం ఉన్నవారికి 27న జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. అర్హులందరూ మండల పరిషత్ కార్యాలయానికి రాకుండా నేరుగా మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత స్లాట్ బుక్ చేసిన రశీదు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్‌లను నిర్ధారిత తేదీల్లో వెంట తెచ్చుకోవాలన్నారు.

‘ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి’

హుజూరాబాద్‌రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు కోరారు. గురువారం బుక్స్ విక్రయిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలలు లాభార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. నాయకులు అజయ్, అరుణ్, వరుణ్, శేషు, శ్రీచరణ్, శశాంక్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మహిళా వ్యాపారవేత్తలకు, కొత్తగా వ్యాపారం ప్రారంభించే మహిళలకు గురువారం జ్యోతినగర్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320, శ్రీసేవామార్గ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు లభించే సబ్సిడీ లోన్‌ల వివరాలు, వీహబ్ ఫౌండేషన్ ద్వారా అందించే శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. సుమారు 100 మంది మహిళలు పాల్గొని తదితర విషయాలపై అవగాహన పొందారు. లయన్ రాజిరెడ్డి, సురేష్, స్వాతి, అశ్విక్, ఫణిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు ఎరువులు వేయాలి

కరీంనగర్‌రూరల్: నర్సరీల్లోని మొక్కలు పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో శ్రీధర్ అన్నారు. గురువారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, బొమ్మకల్‌లోని నర్సరీలను పరిశీలించారు. మొక్కలు చిన్నవిగా ఉన్నాయని, ఉద్యాన అధికారుల సలహా మేరకు తగిన ఎరువులు వేయాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటేందుకు వీలుగా ఉపాధికూలీలు గుంతలు తవ్వుతున్న ప్రాంతాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా గుంతల తవ్వకం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గోపాల్‌పూర్ గ్రామపంచాయతీలో రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో శోభారాణి తదితరులున్నారు.

7న మాదిగల కవాతుకు రండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హుజూరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పడిన ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 7న మాదిగల కవాతు నిర్వహిస్తున్నట్లు సమితి నాయకులు తెలిపారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కవాతుకు దక్షిణాది రాష్ట్రాల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రుద్రారపు రామచంద్రం, మారేపల్లి శ్రీనివాస్, రేణిగుంట్ల సాగర్, మొలుగూరి ప్రభాకర్, అంబాల మధునయ్య, రొంటాల రాజ్‌కుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన శ్రీనివాస్

హుజూరాబాద్ రూరల్: బైక్ అదుపతప్పి పడిపోయిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అజామ్‌నగర్‌కు చెందిన వొడితల శ్రీనివాస్ కొన్ని నెలలుగా హుజూరాబాద్‌లో లారీడ్రైవర్ పని చేస్తున్నాడు. గురువారం బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. రాజాపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లి వద్ద కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో శ్రీనివాస్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ



ఎమ్మెల్యే సతీమణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి



ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు

తిమ్మాపూర్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. రూపాదేవి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఎమ్మెల్యేకు ధైర్యం చెప్పారు.

రామడుగు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గురువారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి, పరామర్శించారు. కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, నాయకులు అజిత్‌రావు, అజయ్‌రెడ్డి, సుధాకర్, ఎల్లేశ్‌కుమార్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పబ్లిసిటీ కోసమే నిరాధార ఆరోపణలు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పబ్లిసిటీ కోసమే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య, దేశినికోటి, సాయిని రవి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని పొనగంటి మల్లయ్య నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్‌రెడ్డి, అతని అనుచరులు జమ్మికుంట పట్టణంలో మహిళా సంఘ భవన స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, ఉద్యోగాలు పెట్టిస్తామని చెప్పి, అమాయకుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని పేర్కొన్నారు. దీనిపై తాము సవాల్ విసిరితే ఇంట్లో స్నానం చేసి, అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. అర్థరహిత మాటలు మానుకొని, ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి పనులు చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల అక్రమాలను బయట పెడతామన్నారు. కౌన్సిలర్లు బొంగోని వీరన్న, రాయికంటి రాజు, సారంగం, ఎలగందుల శ్రీహరి, రాజయ్య, పిట్టల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సమితి సభ్యులు

హుజూరాబాద్: దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని దళిత బంధు రెండో విడత సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హుజూరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో తాత్సారం చేయడం వల్లే నిధులు రాలేదని ఆరోపించారు. దళితుల ఓట్ల కోసమే అప్పటి అధికారులతో బలవంతంగా లాంగ్ లీవ్ పెట్టించి, దళిత బంధును నిలిపివేశారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆ నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్లి, కేసీ క్యాంపులోని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి హుజూరాబాద్ నియోజకవర్గ సభ్యులు కోలుగూరి సురేశ్, మంద రాజేశ్, కోలుగూరి నరేశ్, రామంచ రాకేశ్, అకినపెల్లి ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటితో కూలిన వ్యవసాయ బావి

- మునిగిన విద్యుత్ మోటార్లు



కల్వర్టు ద్వారా బావిలోకి వెళ్తున్న వరద నీరు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో కల్వర్టు మూలంగా వరద నీరు చేరి, ఓ వ్యవసాయ బావి కూలిపోయింది. విద్యుత్ మోటార్లు అందులో పడి, మట్టిలో కూరుకుపోయాయి. గ్రామానికి చెందిన నీలం నాగయ్య, రాజయ్య, కనకయ్య, సారయ్య, సమ్మయ్య అనే రైతులకు సాయికుంట సమీపంలో సర్వే నంబర్ 231తోపాటు ఇతర సర్వే నంబర్లలో 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ వ్యవసాయ బావిలోకి సమీప గుట్ట నుంచి వరద నీరు వచ్చి చేరేలా కల్వర్టు నిర్మించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కల్వర్టు ద్వారా భారీగా వరద నీరు చేరడంతో బావి కూలిపోయింది. రెండు కరెంటు మోటార్లు అందులోనే మునిగిపోయినట్లు బాధితులు తెలిపారు. కాంట్రాక్టర్‌కు ముందుచూపు లేకపోవడం వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. వ్యవసాయ బావి, మోటార్లకు సంబంధించి, పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో రమేశ్‌ను కలిసి, విన్నవించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులతో మాట్లాడుతున్న సీడీపీవో సబిత



కొక్కెరకుంట కేంద్రంలో టీచర్లు, పిల్లలు



చొప్పదండి: మాత్రలు వేస్తున్న ఏసీడీపీవో సౌందర్య

శంకరపట్నం: పౌష్టికాహారంతోనే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సబిత అన్నారు. గురువారం శంకరపట్నం మండలంలోని చింతగుట్ట, ఇప్పలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రోత్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. పిల్లలతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలు, గుడ్లు, ఆకు కూరలు, పప్పు దినుసులలో పోషక విలువలుంటాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు బిడ్డల కోసం నిత్యం పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్రవంతి, టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ డే

రామడుగు: మండలంలోని వెలిచాల, కొక్కెరకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రోత్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువు చూశారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, వైద్యాధికారి ఆర్పిత, పంచాయతీ కార్యదర్శి అరుణ్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

చొప్పదండి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో సౌందర్య సూచించారు. చొప్పదండి పట్టణంలోని అయిదో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పిల్లల బరువు, ఎత్తు కొలతలు నమోదు చేశారు. ఈ సందర్భంగా రెండేళ్లలోపు వయసున్న చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఏడబ్ల్యూటీ దేవమణి, పద్మ, వనజ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న దళిత నాయకులు

రామడుగు: రెవెన్యూ అధికారులు బేడ బుడిగ జంగాలకు ఇస్తున్న ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను తక్షణమే నిలిపివేయాలని, గతంలో ఇచ్చినవాటిని రద్దు చేయాలని రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బేడ బుడిగ జంగాలవారు సన్యాసి కులానికి చెందినవారని, ఎస్సీలు కాదని తెలిపారు. వీరికి కొందరు రెవెన్యూ అధికారులు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతో గ్రామంలో వారి అరాచకాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. తాము చాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి, వారికిచ్చిన పత్రాలను రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు క్లెం అంజయ్య, దాసరి లస్మయ్య, రేణికుంట అశోక్, దాసరి అరుణ్‌కుమార్, దాసరి రవిశాస్త్రి, రేణుకుంట రవి, కత్తెరపాక నరసయ్య, దాసరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పేదరికం చదువుకు ఆటంకం కారాదు’



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు

తిమ్మాపూర్: పేదరికం చదువుకు ఆటంకం కారాదని, అందరూ ఉన్నత చదువులు చదవాలని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ పంచాయతీ పరిధి సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి కనకయ్య హాజరై, 250 మంది విద్యార్థులకు 12 చొప్పున నోటుపుస్తకాలు అందించారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాగర్‌రావును సన్మానించారు. హెచ్ఎం మహేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కురం లక్ష్మి, గుజ్జుల రవీందర్ రెడ్డి, మీసాల అంజయ్య, గుజ్జుల ప్రణీత్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

వీణవంక: మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కోటోజు సతీశ్ 5వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకుడు గోనెల సమ్మయ్య తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు



హుజూరాబాద్: విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పంచాయతీరాజ్ అధికారులపై హుజూరాబాద్ పట్టణానికి చెందిన టేకుల శ్రవణ్ గురువారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ మండల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నాడు. దీనిపై జిల్లా, మండల పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించాడు. రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోయాడు.

దాడి చేశారని సీపీకి ఫిర్యాదు

వీణవంక: ఈ నెల 25న కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేసినట్లు వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఇసంపల్లి రాజు గురువారం తెలిపాడు. అతని వివరాల ప్రకారం.. రాజు ఇంటి పక్కనున్న స్థలం విషయంలో ముగ్గురు వ్యక్తులు మే 5న అకారణంగా అతని కుటుంబసభ్యులపై దాడి చేశారు. చంపుతామని బెదిరించారు. అదేరోజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోలేదు. ఆ ముగ్గురు తమపై దాడి చేసి, తమపైనే కేసు పెట్టారని, ప్రాణభయం ఉందని సీపీని కలిసి విన్నవించినట్లు రాజు పేర్కొన్నాడు.